క్లుప్తంగా

తడి, పొడి చెత్తపై అవగాహన

కొత్తగూడెంఅర్బన్: స్వచ్ఛ సర్వేక్షణ్ – 2023లో భాగంగా పట్టణంలోని ఐదో వార్డులో మున్సిపల్ శానిటరీ విభాగం ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛోత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. కౌన్సిలర్ అనిల్ అధ్వర్యంలో డ్వాక్రా మహిళలతో స్వచ్ఛోత్సవ్‌పై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం తడి చెత్త, పొడి చెత్త వేరుచేయుడంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వీరభద్రాచారి, అశోక్, టీఎంసీ నాగయ్య, ఐటీసీ కోఆర్డినేటర్ రవి, మెప్మా సిబ్బంది, రిసోర్స్‌పర్సన్స్, స్థానికులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా రాంపురంలో శనివారం సింగరేణి మెడికల్, హెల్త్ డిపార్ట్‌మెంట్ల ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ మాట్లాడుతూ.. ఏరియా పరిధిలోని ప్రభావిత ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణకు సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించినట్లు చెప్పారు. ఈ క్యాంపులో సుమారు 100 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం శ్రీరమేష్, సీనియర్ పీఓ శ్రావణ్‌కుమార్, సర్పంచ్ వెంకటమ్మ, పంచాయతీ సెక్రటరీ డి.లలిత, నరసింహా, చెన్నారావు పాల్గొన్నారు.

పరీక్షల సామగ్రి వితరణ

కొత్తగూడెంఅర్బన్: ఫ్రెండ్స్ ఫౌండేషన్ కొత్తగూడెం ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్షల సామగ్రిని శనివారం పంపిణీ చేశారు. పట్టణ పరిధి మేదరబస్తీ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్, జామెట్రీలను అందజేశారు. సీహెచ్ శ్రీకాంత్, డేవిడ్, సత్యసాయి, ప్రకాష్, కళ్యాణి, ఓంకార్, హెచ్‌ఎం కే.మంజుల, ఉపాధ్యాయులు అనురాధ, సౌందర్య, ప్రసాదబాబు, వీరబాబు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

జూలూరుపాడు: ఇటీవల అకాల వర్షంతో మండలంలోని వినోబానగర్ గ్రామానికి చెందిన రైతు సాయిన్ని నరసింహారావు మొక్కజొన్న పంట దెబ్బతింది. శనివారం వైరా ఎమ్మెల్యే రాములు నాయక్ మొక్కజొన్న పంటను పరిశీలించారు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కొత్తగూడెం ఏడీఏ కరుణశ్రీ, జూలూరుపాడు ఏఓ రఘుదీపిక, ఎంపీపీ సోనీ, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్యా కళావతి, సర్పంచ్ భూక్యా పద్మ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పొన్నెకంటి సతీష్ కుమార్, జిల్లా నాయకులు ఎల్లంకి సత్యనారాయణ, వేల్పుల నరసింహారావు, చౌడవరం నరసింహారావు పాల్గొన్నారు.

29న జన చైతన్య యాత్ర ముగింపు సభ

సింగరేణి(కొత్తగూడెం): ఈనెల 29న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌లో జన చైతన్య యాత్ర ముగింపు సభను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య పిలుపునిచ్చారు. శనివారం కొత్తగూడెంలోని మంచికంటి భవన్‌లో జిల్లా కమిటీ, మండల కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ మతోన్మాద కార్యకలాపాలను నిరసిస్తూ ఈనెల 17న హన్మకొండలో ప్రారంభమైన ఈ యాత్ర ఈనెల 29న హైదరాబాద్ చేరుకుంటుందని, ఈ సందర్భంగా బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏజే రమేష్, కొక్కిరపాటి పుల్లయ్య, ఎం.జ్యోతి, ఎం.నర్సిరెడ్డి, లిక్కి బాలరాజు, కారం పుల్లయ్య, అన్నవరపు సత్యనారాయణ, కొండపల్లి శ్రీధర్, భూక్యా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ రుచులకు సలాం..

ఘుమఘుమలాడే సువాసనలు వెదజల్లుతూ.. నోట్లో వేసుకుంటే కరిగిపోయే.. హలీం, హరీస్.. రుచి అత్యంత మధురం.. వీటి పుట్టుపూర్వోత్తరాల్లోకెళితే.. హలీం, హరీస్‌ను తొలుత అరబ్ దేశాలలో మాత్రమే తయారుచేసేవారు. క్రమంగా ప్రపంచ వ్యాప్తంగా విస్తరించింది. మొఘల్ పాలకుల కాలంలో ఢిల్లీకి, నిజాం నవాబుల పరిపాలనలో హైదరాబాద్‌కు చేరిన హలీం, హరీస్ రుచులను తెలుగు సంస్కృతి మరింతగా ఆదరించింది. ఆ తరువాత అన్ని ప్రాంతాలకూ విస్తరించింది. బిర్యానీ ఎప్పుడూ ఉండేదే.. హలీం, హరీస్ మాత్రం రంజాన్ స్పెషల్.


ఇల్లెందులో హలీం విక్రయ కేంద్రం

సండే స్పెషల్

నోరూరించే హలీం, హరీస్

- పట్టణాల్లో ప్రత్యేక స్టాళ్లలో విక్రయాలు
- నెలంతా అందుబాటులో..



ఇల్లెందురూరల్: తెల్లవారుజామున సహరితో రోజా (ఉపవాస దీక్ష) ప్రారంభించి మనసంతా అల్లాహ్‌కి ఇచ్చేసినా, సాయంత్రం ఇఫ్తార్ వేళ ఏవరైనా హలీం, హరీస్‌లను రుచి చూడాల్సిందే. ప్రతిరోజూ పానీపూరీలు, పుల్కాలకు అలవాటు పడిన ప్రజలు రంజాన్ మాసంలో మాత్రం హలీం, హరీస్‌లే. ఇంతటి రుచికరమైన వంటకాలను ఆరగించేందుకు ముస్లింలతోపాటు అన్నివర్గాల ప్రజలు రంజాన్ మాసం కోసం ఎదురు చూస్తుంటారు.

ఎలా తయారు చేస్తారంటే..

హలీం, హరీస్‌ల రుచి వంట మాస్టర్ తయారీ విధానంపైనే ఆధారపడి ఉంటుంది. వీటి తయారీ ప్రత్యేకంగా ఉంటుంది. దీన్ని రుచిగా తయారు చేయడానికి వంట మాస్టర్లు పడే శ్రమ అంతా ఇంతా కాదు. వీటిని తయారు చేసేందుకు ముందుగా ప్రత్యేకమైన మట్టి బట్టీ సిద్ధం చేస్తారు. దీనిలో పెద్ద పాత్ర ఉంచి కట్టెలతో మంట చేస్తారు. నానబెట్టిన గోధుమ రవ్వ లేదా గోధుమలు వేసి హలీంకు అయితే మటన్, హరీస్‌కు అయితే చికెన్ ముక్కలు దానిలో వేసి నెయ్యి, నీరు పోసి ఉడికించడం ప్రారంభిస్తారు. ప్రతిరోజూ తెల్లవారు జామున ప్రారంభమైన ఈ వంటకం మధ్యాహ్నం 3 గంటలయితే కానీ పూర్తికాదు. అంతకు ముందే వేరుగా సిద్ధం చేసిన మసాలా దినుసులు, సుగంధ ద్రవ్యాలు వేసి ప్రత్యేకమైన కట్టె గంటెతో కలియబెట్టడం చేస్తారు. ఇలా 3, 4 గంటలు దంచడం, తిప్పడం చేస్తేనే పాత్రలో వేసిన ఆహార పదార్థాలన్నీ పేస్ట్‌లా తయారవుతాయి. దాన్ని ప్లేట్లలోకి తీసుకొని లెమన్, వేయించిన పల్చటి ఉల్లిగడ్డ ముక్కలతో కలిపి వడ్డిస్తారు. శేరువా కూడా ఇస్తారు. అలా.. పొగలు కక్కుతున్న హలీం, హరీస్‌లను నోట్లో వేసుకుంటే స్వర్గంలో ఉన్నట్టుంది అంటుంటారు వాటి రుచి చూసినవారు. అందుకే రంజాన్ మాసంలో మాత్రమే లభించే హలీం, హరీస్ రుచి చూసేందుకు ప్రజలు ఎదురు చూస్తుంటారు.

పలు కూడళ్లలో విక్రయ కేంద్రాలు..

ఇంతకు ముందు చాలామంది హైదరాబాద్ వెళ్లి హలీం, హరీస్ రుచి చూసి ఇంటికి వచ్చాక నెలంతా మర్చిపోలేకపోయేవారు. మన ప్రాంతంలో కూడా లభిస్తే బాగుండని అల్లాను కోరుకునేవారు. అలాంటి వారి ఆశల ఫలితమేమో.. దశాబ్దకాలంగా జిల్లా వ్యాప్తంగా ఇల్లెందు, కొత్తగూడెం, పాల్వంచ, మణుగూరు వంటి పట్టణ కేంద్రాలలో హలీం, హరీస్ సెంటర్లు వెలుస్తున్నాయి. ఫుడ్ రెస్టారెంట్లు, హోటళ్లు కూడా ప్రత్యేకంగా హలీం, హరీస్ సెంటర్లను ఏర్పాటు చేసి ప్రతిరోజు సాయంత్రం రంజాన్ స్పెషల్ వంటకాలను ప్రత్యేకంగా అందిస్తున్నాయి.

చాలా రుచిగా ఉంటుంది



హలీం, హరీస్ పోషక విలువలతో కూడిన రుచికరమైన ఆహారం. రంజాన్ మాసంలో వీటిని ఇష్టపడని వారుండరు. గతంలో హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లినప్పుడే మాత్రమే రుచిచేసే వాళ్లం. ఇప్పుడు అన్నిచోట్లా విక్రయించడం ఆనందంగా ఉంది.

– సయ్యద్ అబ్దుల్ భారీ, వెల్డింగ్ షాపు నిర్వాహకుడు, ఇల్లెందు

అందుబాటు ధరల్లోనే..



హలీం తయారీ వెనుక ఎంత కష్టమున్నా అందరికీ అందుబాటులో ఉండే ధరల్లోనే విక్రయిస్తున్నాం. రంజాన్ మాసంలో హలీం రుచిని అందరికీ అందించాలనే లక్ష్యంతో ప్రత్యేకంగా స్టాల్‌ను ఏర్పాటు చేశాం. ఉపాధి కూడా ఉంటుంది. విక్రయాలు బావున్నాయి.

– అమానుల్లాఖాన్, హలీం సెంటర్ నిర్వాహకుడు, ఇల్లెందు

వేలంపాటలో రూ.1.06 లక్షల ఆదాయం

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ పరిధిలోని దుకాణాల వేలంపాటలో రూ.1.06 లక్షలు ఆదాయం వచ్చింది. గ్రామ పంచాయతీ ఆధీనంలోని రెండు షాపులకు శనివారం పంచాయతీ అధికారులు బహిరంగ వేలంపాట నిర్వహించారు. దుకాణాలను కైవసం చేసుకునేందుకు పోటీపడ్డ స్థానికులు వేలంలో మొదటి దుకాణాన్ని రూ.50,300 రెండో దుకాణాన్ని రూ.56వేలకు దక్కించుకున్నారు. సొమ్మును గ్రామ పంచాయతీ ఖాతాలో జమ చేశారు. సర్పంచ్ వల్లాల మంగమ్మ, ఉపసర్పంచ్ నాలవెల్లి నర్సింహారావు, ఎంపీటీసీ శీలం ఉమ పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతును నొక్కుతున్న మోదీ

కొత్తగూడెంరూరల్: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న ప్రధాని మోదీ ప్రశ్నించే గొంతు రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయటం సరైంది కాదని టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాహుల్‌గాంధీపై అన్హరత వేటు వేయటం ప్రజాస్వామ్యానికి గొడ్డలి వేటు అన్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రను చూసి మోదీకి భయం పట్టుకుందన్నారు. బొమ్మిడి మల్లికార్జున్, సకినాల వెంకటేశ్వరరావు, అంతోటి పాల్, పల్లపు వెంకటేశ్వర్లు, కల్లెపల్లి రాజా, జలీల్ ఉన్నారు.

నరేంద్రమోదీ దిష్టిబొమ్మ దహనం

రాష్ట్ర టీపీసీసీ ఉపాధ్యక్షుడు పోట్ల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో యువజన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఏనుగుల అర్జున్‌రావు, జేబీ శౌరీ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించిన రాహుల్ గాంధీ మీద కోర్టులకు తప్పుడు సమాచారం అందించి రాహుల్‌గాంధీని దోషిగా తెల్చి, ఆయన పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయటం గర్హనీయమన్నారు.


సుజాతనగర్: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

మహమ్మద్ గౌసు, పగడ భిక్షపతి, అల్లాడి నరసింహారావు, బట్టు మురళి, సంగు యాలాద్రి, దుర్గారావు, కొమురయ్య, ఏలూరి రాందాస్, లక్ష్మయ్య, శంకర్, హరిసింగ్ ఉన్నారు.

సుజాతనగర్: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయడం అప్రజాస్వామికమని టీపీసీసీ సభ్యుడు నాగా సీతారాములు అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో సుజాతనగర్‌లో శనివారం ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అబీద్, బానోత్ కొటేష్ నాయక్, మాచిన శ్రీకాంత్, కిసాన్ లోకొట్టి నాగార్జున, బాలు భద్రరావు, వీరాపురం రామలక్ష్మణ్, గరిక జయరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్యశిబిరం

సుజాతనగర్: జీఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సుజాతనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని నిమ్స్, స్టార్, కేర్ ఆస్పత్రులకు చెందిన వైద్యులు హాజరై పరీక్షలు చేస్తారని, ఈ అవకాశాన్ని సుజాతనగర్ పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

పాల్వంచరూరల్: సమాజంలో యువత చెడు అలవాట్లకు, వ్యసనాలకు బానిసలు కాకుండా ఉండాలని పట్టణ ఎస్‌ఐ నరేష్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. మత్తుపదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని తెలిపారు. తల్లిదండ్రులు పెట్టుకొన్న ఆశలను వమ్ము చేయకుండా సత్ప్రవర్తనతో మెలగాలని మత్తుపదార్థాలకు అలవాటుపడితే మీపై ఆధారపడిన కుటుంబాలు వీధిన పడతాయని పేర్కొన్నారు. ఎవరైనా గంజాయి తాగినా, అమ్మినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మీ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా మత్తుపదార్థాలు సేవిస్తున్నట్లు అనుమానిస్తే 8712682050, 8712682052, 8712682051 నంబర్లకు ఫోన్‌లో సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చి వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

ఆర్థిక సాయం

టేకులపల్లి: ప్రెగళ్లపాడు పంచాయతీ తెలుగూరు గ్రామానికి చెందిన మాచర్ల గోపాలకృష్ణ తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చుల కోసం ఆపన్న హస్తం కోసం కుటుంబ సభ్యులు ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో తెలుగూరు, పడమటిగుంపు, తూర్పుగూడెం గ్రామాలకు చెందిన యువకులు, గ్రామస్తులు సహృదయంతో రూ.1.32 లక్షలు వితరణగా అందజేశారు. దాతలు బాధితుడి సోదరుడు మాచర్ల రమేష్‌బాబు 9885856294 నంబరు ఆర్థికసాయం అందించాలని కోరారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక


అసోసియేషన్ కార్యవర్గం సభ్యులు

ఇల్లెందు: ఇల్లెందు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా మామిడి సత్యప్రకాష్ ఎన్నికయ్యారు. శనివారం కోర్టు హాల్‌లో జరిగిన అసోసియేషన్ ఎన్నికలో ఉపాధ్యక్షుడిగా బి.రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా కీర్తికార్తీక్, కోశాధికారిగా కె.ఉమామహేశ్వరరావు ఎన్నికయ్యారు. ఎన్నికను సీనియర్ న్యాయవాది టి.మహేశ్వరరావు పర్యవేక్షించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్య ప్రకాష్ మాట్లాడుతూ.. కోర్టులో న్యాయవాదులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.

పోషకాహారంతోనే తల్లీబిడ్డలకు ఆరోగ్యం

టేకులపల్లి: చిరుధాన్యాలు, ఆకుకూరలు, బాలామృతం, కూరగాయాలు, పండ్ల ద్వారా లభించే పోషకాహారంతోనే తల్లీబిడ్డలకు ఆరోగ్యం లభిస్తుందని జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య, సీడీపీఓ కాంపెల్లి మంగతార అన్నారు. ఈ మేరకు శనివారం కోయగూడెం ఆశ్రమ పాఠశాలలో మండల స్థాయిలో ఏర్పాటు చేసిన పోషణ్ పక్వాడా వారోత్సవాల కార్యక్రమంలో వారు మాట్లాడారు. బాలబాలికలు, తల్లులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. అందరిచేత ప్రతిజ్ఞ చేయించారు. ఆరోగ్యానికి హాని కలిగించే పానియాలు, తినుబండారాలు తీసుకోవద్దని, ఇంట్లో వండిన పదార్థాలనే తీసుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీ కిచెన్ గార్డెన్‌లో పండించిన, తయారు చేసిన పోషకాహారం ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, గుడ్లు, బాలామృతంతో దోశలు, జొన్న రొట్టె, కొబ్బరి, మినుముల లడ్డు, క్యారెట్, కందగడ్డలు, గుగ్గిళ్లు, పాయసం తదితర పదార్థాలను ప్రదర్శించి వాటి ఉపయోగాలను తెలియజేశారు. పోషకాహార వంటలను రుచి చూసిన జెడ్పీ చైర్మన్ అంగన్‌వాడీ టీచర్లను అభినందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కొమరం యశోదమ్మ, కొడెం అనురాధ, గుర్రం శ్రీలక్ష్మి, కుంజా సక్కుబాయి, హెచ్‌ఎంలు అమర్ సింగ్, లాలయ్య, టీచర్ శారద, నాగిరెడ్డి, శకుంతల, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. గంగారం సెక్టార్ పరిధిలోని కిష్టారం, టేకులగుంపు, గోప్యాతండా, మేళ్లమడుగు, సంపత్‌నగర్, చింతోనిచెలక, చింతోనిచెలక తండా కేంద్రాల్లో యుక్త వయసు బాలికలకు చిరు ధాన్యాలపై అవగాహన కల్పించారు. సులానగర్ సెక్టార్ పరిధిలోని ముత్యాలంపాడు క్రాస్‌రోడ్డు అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ వై.పద్మావతి ఆధ్వర్యంలో అక్షరాభ్యాసం, పోషకాహారంపై అవగాహన, చేతులు శుభ్రం చేయడం, ప్రతిజ్ఞ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. హెచ్‌ఎం పద్మ పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: పోషణ్ పక్షోత్సవ కార్యక్రమంలో భాగంగా పునుకుల, పుల్లాయిగూడెం గ్రామాల్లోని అంగన్‌వాడీ విద్యార్థులతో శనివారం ప్రదర్శన నిర్వహించారు. పిల్లలకు చిరుధాన్యాలు తినిపించాలని కోరుతూ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ కనకదుర్గ మాట్లాడుతూ.. పిల్లలకు చిరుధాన్యాలను తినిపించాలని తల్లిదండ్రులను కోరారు. సూపర్‌వైజర్ వసంతరాణి, వీఓ సుమలత, హెచ్‌ఎం.వీరు, టీచర్లు చుక్కమ్మ, వీరభద్రమ్మ, రమాదేవి విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: మండలంలోని సుదిమళ్ల గురుకుల పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం పోషణ్ పక్షోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. సీడీపీఓ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ.. మెరుగైన ఆరోగ్యం కోసం చిరుధాన్యాలను అధికంగా తీసుకోవాలని సూచించారు. బాలికలలో రక్తహీనత నివారించే మార్గాలపై అవగాహన కల్పించారు. అనంతరం చిరుధాన్యాల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతి, రామకళ, అంగన్‌వాడీ టీచర్లు అరుణ, నరసమ్మ, సరిత, సారమ్మ, నీరజ, సరస్వతి, వెంకటనర్సమ్మ, నీల తదితరులు పాల్గొన్నారు.


టేకులపల్లి: కోయగూడెంలో ప్రతిజ్ఞ చేస్తున్న బాలబాలికలు, టీచర్లు


ఇల్లెందురూరల్: అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ లక్ష్మీప్రసన్న


పాల్వంచరూరల్: పుల్లాయిగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ విద్యార్థులు

పేదలకు వరం కల్యాణలక్ష్మి

సూపర్‌బజార్(కొత్తగూడెం): పేదింటి ఆడపడుచులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు వరమని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధి 36 వార్డుల్లోని 79 మంది లబ్ధిదారులకు రూ.79 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పేదింటి ఆడపడుచులకు పెద్దన్నగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పథకాలను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్ చైర్మన్ దామోదర్, తహసీల్దార్ శర్మ, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, రెవెన్యూ సిబ్బంది, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వనమా

విద్యా సమస్యలు పరిష్కరించాలి

పాల్వంచరూరల్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఎనిమిదేళ్లు గడిచినా ప్రభుత్వం విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయిందని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు బుటారి రాజు అన్నారు. స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలలో శనివారం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులకు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులకు పద్దులవారిగా బడ్జెట్‌ను కేటాయించి ట్రెజరీ, బ్యాంకుల ద్వారా జీతాలు, బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలు పరచలేదన్నారు. గిరిజన సంక్షేమ వసతి గృహాలను ఆశ్రమ పాఠశాలలుగా మార్చి పదేళ్లు అయి కొత్తపోస్టులు మంజూరు చేయడం లేదని, కాంట్రాక్టు టీచర్లను రెగ్యూలర్ చేయాలని కోరారు. ఇప్పటికైనా ప్రభుత్వం విద్యారంగంపై శ్రద్ధ చూపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోతు హరిలాల్, రామాచారి, రాంబాబు, పి.గంగరాజు, బి.రమేష్, బి.భాగ్యరావు, ఎస్.కృష్ణబాబు, ఏ.రామ్‌చంద్, భాస్కర్, ఎస్.వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్రస్థాయి పర్యటన


కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సక్రునాయక్


సూపర్‌బజార్(కొత్తగూడెం): క్షేత్ర పర్యటనలో విద్యార్థినులు


కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల రెండవ, మూడో సంవత్సరం విద్యార్థులకు శనివారం ఇండస్ట్రియల్ టూర్ నిర్వహించారు. అకడమిక్ సిలబస్ పాఠ్యాంశాల ప్రాక్టికల్ విశ్లేషణలో భాగంగా పోస్టాఫీసు సెంటర్‌లోని బీఎస్‌ఎన్‌ఎల్ టెలిఫోన్ ఎక్స్ఛేంజీను సందర్శించారు. సబ్ డివిజనల్ ఆఫీసర్ బానోత్ సక్రునాయక్ బ్యాటరీ, పవర్‌ప్లాంట్, ఏసీ యూనిట్లు, ల్యాండ్ లైన్ టెలిఫోన్ స్విచ్, ఇన్‌డోర్, అవుట్‌డోర్ కేబుల్ నెట్‌వర్క్ గురించి, బ్రాడ్ బ్యాండ్ నెట్‌వర్క్ పనితీరు గురించి విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో గోపి రాజేష్, బానోతు సక్రునాయక్, షకీల్, రామరాజు, సందీప్, జేఈలు మాన్‌సింగ్, నూర్‌మహమ్మద్, జైపాల్‌రెడ్డి, శివరాంజీ, నిరంజన్, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఎడ్యుకేషన్ సొసైటీ సహకారంతో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థినులు వన్యప్రాణి సంరక్షణ, అవగాహనకు శనివారం జంతుశాస్త్ర క్షేత్ర పర్యటనకు వెళ్లారు. ప్రిన్సిపాల్ శారద మాట్లాడుతూ.. ప్రతిసంవత్సరం బీఎస్సీ జంతుశాస్త్ర విద్యార్థినులకు ఈ పర్యటనకు తీసుకెళ్తామని తెలిపారు. అధ్యాపకులు కె.స్వర్ణలత, పర్వీన్, ఎస్‌కే సఫియా పాల్గొన్నారు.

సింగరేణిలో భద్రతపై అవగాహన

ఇల్లెందు: సింగరేణి సంస్థ ఇల్లెందు ఏరియాలో సివిల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో రక్షణ వారోత్సవాలు నిర్వహించారు. శనివారం కొత్తగూడెం ఏరియా రక్షణ కమిటీ కన్వీనర్ ఏరియా సేఫ్టీ ఆఫీసర్ జీవీ కోటిరెడ్డి నేతృత్వంలో సేఫ్టీ కమిటీ సభ్యులు ఇల్లెందు ఏరియాలో పర్యటించి సివిల్ పనుల వారు పాటిస్తున్న రక్షణ చర్యలపై తనిఖీ నిర్వహించారు. అనంతరం భద్రతపై అవగాహన కల్పించారు. రక్షణ పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పని ప్రదేశంలో తప్పనిసరిగా రక్షణ సూత్రాలు పాటించాలని కోరారు. సింగరేణి ఉద్యోగులకు కాంట్రాక్ట్ కార్మికులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఏరియా సేఫ్టీ అధికారి పంజాల శ్రీనివాస్, జేకేఓసీ మేనేజర్ పూర్ణచందర్, శివప్రసాద్, సేఫ్టీ ఆఫీసర్ వెంకటేశం, ఈఈ సివిల్ రాజారాం, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కష్టపడాలి


ప్యాడ్లు పంపిణీ చేస్తున్న డీహెచ్ శ్రీనివాసరావు

సుజాతనగర్: ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని సాధించేందుకు కష్టపడి చదవాలని రాష్ట్ర హెల్త్ డైరెక్టర్ డాక్టర్ గడల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 8,9,10 తరగతుల విద్యార్థులకు జీఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలంటే విద్యార్థి దశలోనే కష్టపడాల్సి ఉంటుందన్నారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదివి నేడు రాష్ట్రస్థాయి అధికారి హోదాకు వచ్చానని చెప్పారు. ఉపాధ్యాయులు వీరభద్రరావు, విద్యాకమిటీ చైర్మన్ కొమారి కృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ బోడా హరి, ట్రస్ట్ మేనేజర్ అంజి, ప్రభాకర్, జోగారావు, వర్మ, వినోద్ పాల్గొన్నారు.

ఆస్పత్రికి ఐసీయూ బెడ్..

స్థానిక ప్రభుత్వాస్పత్రికి జీఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఐసీయూ బెడ్‌ను డీహెచ్ గడల శ్రీనివాసరావు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షేమమే ధ్యేయం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్పొరేట్ కార్యాలయంలో అనేక సంవత్సరాలు పనిచేసి కార్మికుల సంక్షేమం, మౌలిక వసతుల ఏర్పాటుకై ఉన్నతాధికారులతో చర్చించి, నిత్యం వారి అభ్యున్నతికి పాటుపడిన అధికారి సామ్యూల్ సుధాకర్ అని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య అన్నారు. కొత్తగూడెం ఏరియాలోని జీఎం కార్యాలయంలో పనిచేస్తూ ఇటీవల ఏజీఎంగా పదోన్నతి పొందిన సామ్యూల్ సుధాకర్‌ను ఆయన బృందం శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడారు. ఏరియా ఉపాధ్యక్షుడు మొగిలిపాక రవి, కాదాసు కుమారస్వామి, కాంట్రాక్ట్ కార్మికులు ఇనుపనూరి నాగేశ్వరరావు, నిర్మల పాల్గొన్నారు.


సామ్యూల్ సుధాకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

అటెన్షన్ ప్లీజ్

అంగన్‌వాడీ కేంద్రానికి రక్షణేదీ ?

టేకులపల్లి మండలం కొప్పురాయి గ్రామపంచాయతీ కొప్పురాయిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రానికి రక్షణ కరువైంది. ఈ కేంద్రంలోనే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పంపిణీ చేసే పోషకాహారం, వంట సామగ్రి, రికార్డులు, ఆట వస్తువులు ఫర్నిచర్ అన్నీ ఉంటాయి. ఇలాంటి ఈ కేంద్రానికి ప్రహరీ ఉంది కానీ, గేటు మాత్రం లేదు. కట్టెలనే గేటులాగా అడ్డు పెట్టుకోవాల్సిన పరిస్థితి. ఉన్నతాధికారులు స్పందించి అంగన్‌వాడీ కేంద్రానికి గేటు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– టేకులపల్లి



ప్రశ్నించాల్సిన అధికారి : రాజు, పీఆర్ ఏఈ, టేకులపల్లి
సెల్ నంబర్ : 96760 29621